

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**చదువుకోకుండా** ఓ లాబ్‌లో పనిచెయ్యడం ఎంత బావుందో రిసర్చ్ పేపర్ రాస్తూ లేదా ఎక్స్‌పరిమెంట్‌ల గురించి చదువుతూ సగంలో క్లాస్‌కి పరుగుతీయాల్సిన అవసరంలేదు. ఎగ్జామ్స్ కి చదవడం, ఆ సమయంలో లాబ్ పని చెయ్యకపోవడంలాంటివి లేకపోవడంతో కాన్సన్‌ట్రేషన్‌తో పనిచెయ్యగలుగుతున్నాను. చాలామంది సెలవులకి ఇంటికో లేదా వేరే ఊరికో వెళ్ళడంతో అంతా ఖాళీగా ఉంది. కేంపస్ కళకళలాడుతున్నప్పుడు ఉన్న ఆనందం వేరు, కేంపస్‌లో చాలా కొంతమంది కనబడడంతో పొందే ఆనందం వేరు. మా లాబ్‌లో నేను రెయిన్ మరో బెంగాలీ అబ్బాయి మాత్రమే ఉన్నాము. ప్రొఫెసర్ కేవలం ఒక్క క్లాస్ చెప్పడంతో తరచూ మా లాబ్‌కి వచ్చి మా ముగ్గురికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇలా ఆయన రోజు వచ్చి పలకరించడం ఆ బెంగాలీ అబ్బాయికి నచ్చలేదు. తను చాలాసేపు పని చెయ్యకుండా వాళ్ళ భాషలో ఫోన్ మాట్లాడ్డానికి ఆయన భంగం కలిగిస్తున్నారని కాబోలు. ఆయన రోజూ వచ్చేంతవరకు రెయిన్ చక్కగా

పని చేసేది. ఆయన వెళ్ళిపోగానే మాటలు మొదలు పెట్టేది. చేత్తో చేసే పని అయితే కబుర్లు చెప్పుకుంటూ చెయ్యొచ్చుకానీ బుర్రతో చేసే పని కనుక నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. దాంతో ఓ వారం రోజులకి ప్రొఫెసర్ గదిలోకి వెళ్ళి ఏదో ప్రశ్న అడిగి, ఆయన్ని రోజూ పొద్దున ఓసారి, సాయంత్రం ఓసారి లాబ్‌కి రమ్మన్నాను.

ఆయన ఆశ్చర్యపోయి 'ఇలా రెండు మూడుసార్లు రమ్మని నువ్వు ఒక్కదానివే అడిగావు. మిగిలిన వారు వారానికి ఒక్కసారి చాలు అనేవారు' అన్నారు. కప్పిపుచ్చుకోవడానికి 'మేము ఏదైనా తప్పుగా ప్రయత్నిస్తే మీరు వెంటనే చెప్పగలుగుతారు. అప్పుడు మేము ఒక రోజు పూర్తిగా శ్రమించి విఫలమవ్వము' అన్నాను.

ఆయన చిన్నగా నవ్వి 'సరే' అన్నారు. స్నేహం బలపడడంతో నేను పిలిచానని కాకుండా ప్రొఫెసర్ వస్తానన్నారని చెప్పాను. దాంతో ఉదయం ఆయన వచ్చేంతవరకు పనిచేసి, ఆ తరవాత సాయంత్రం ఆయన మళ్ళీ వచ్చేదాకా కబుర్లు చెప్పేది. గమ్మత్తుగా పని మాత్రం ఆ కొంత సమయంలోనే పూర్తిచేసేది కూడా. మేధావి అంటే అదేనేమో. కొన్నిసార్లు బయట అడుగులు చప్పుడు వినబడుతుంది అని నిశ్శబ్దంగా ఉండమనేదాన్ని. అంత మాట్లాడే వ్యక్తిని నేను ఎప్పుడూ చూడలేదు.

ఓ రోజు మధ్యాహ్నం మేము లంచ్‌కి కెఫెటీరియాకి వెళుతుండగా బెంగాలీ అబ్బాయి కూడా నిలబడ్డాడు. 'తనని కూడా పిలుద్దామా?' అని రెయిన్ నన్ను అడిగింది.

ఇష్టం లేకపోయినా తప్పక 'సరే' అన్నాను. నన్ను చూస్తూ నిలబడింది. వినబడలేదేమో అని పిలవమన్నాను. 'ఓ...ఓకే' అంది.

కానీ కదలలేదు.

"డూ యు నో హిజ్ నేమ్?" నెమ్మదిగా అడిగింది.

మొదట్లో పరిచయం చేసాక అతనితో నేను మాట్లాడింది లేదు. దాంతో గుర్తు రాక తల అడ్డంగా ఊపాను. ఇద్దరం ఆలోచిస్తుండగా అతను తలుపువైపుకి నడిచాడు. మేము తలుపుకి మూడు అడుగుల దూరంలో ఉన్నాము.

సర్ అని 'హాయ్' అన్నాను. రెయిన్ చిన్నగా నవ్వింది.

అతను 'ఏం కావాలి?' అన్నట్టు చూసాడు.

"ఆర్ యు గోయింగ్ ఫర్ లంచ్?" అడిగాను.

"వై?" అడిగాడు.

అనవసరంగా ఇతన్ని కదిలించా అనుకుని 'నథింగ్' అన్నాను.

"వి ఆర్ గోయింగ్ టు కేఫెటీరియా" అంది రెయిన్.

"మీటూ" అని బయటకి వెళ్ళాడు.

"హౌ రూడ్.. హౌ మీన్" అంటూ నేను, రెయిన్ అతన్ని ఓ రెండు నిమిషాలు తిట్టుకుని బయటకి నడిచాము. అతను అక్కడే నిలబడడం చూసి ఆశ్చర్యపోయాము.

'మన తిట్లు వినబడలేదుగా' అన్నట్టు మొహం చూసుకున్నాం ఇద్దరం. వెళ్ళేదారిలో సగం సేపు అంతా నిశ్శబ్దం. ఆ తరవాత నేను, రెయిన్ మాటల్లో పడ్డాము. అతని పేరు ఇంకా గుర్తురావకపోవడంతో అతన్ని మా సంభాషణలోకి లాగలేదు. నేను రెయిన్ ఎప్పటిలానే పిజ్జా తీసుకున్నాము. అతను బర్గర్ తీసుకుని మా టేబుల్ దగ్గరకి వచ్చాడు.

"వాట్ ఈజ్ యువర్ థీసిస్" అడిగింది రెయిన్.

"ఇట్స్ ఓవర్" అన్నాడు.

"దెన్ యు డోంట్ వర్క్?" అడిగాను.

కేవల థీసిస్ రిపోర్ట్ మాత్రమే ఉందని, అది సమ్మర్‌లో పూర్తిచేసి ఫాల్‌లో గ్రాడ్యుయేట్ అవుతానని చెప్పాడు. ఎందుకో తెలియకుండానే ఈర్ష్య కలిగింది. ఏ క్లాసులు తీసున్నాము, ఏ క్లాసులు తీసుకోవాలి అంటూ మా చర్చ సాగింది. ఇంతలో నాకు తెలిసిన అబ్బాయి ఇతన్ని పలకరించాడు. దాంతో వెంటనే తనకి ఫోన్‌లో మెసేజ్ చేసాను. 'వాట్ ఈజ్ హిజ్ నేం?' అని.

పేరు తెలీకుండా టేబుల్స్ ఖాళీగా ఉన్నా కలిసెందుకు కూర్చున్నారు? అన్న విధంగా చూసాడు.

"ఫైసల్, ఆర్ యు కమింగ్ టుడే?" అడిగాడతను.

తన పేరు ఫైసల్ అన్నమాట. ఇంక జీవితంలో ఈ వ్యక్తి పేరు మర్చిపోలేను. నేను, రెయిన్ ఊపిరి పీల్చాము. వాళ్ళందరూ క్రికెట్‌లో ఫ్రెండ్స్ అని, రోజూ ప్రాక్టీస్ చేసి నెల తిరిగాక వాళ్ళల్లో వాళ్ళే ట్రోఫీ ఇచ్చుకుని పోటీ పడతారని చెప్పారు. రెయిన్‌కి అర్థంకాక పోవడంతో క్రికెట్ గేంని కొంతవరకు ముగ్గురం ఎక్స్‌ప్లెయిన్ చేసాము. నాకు క్రికెట్ అంటే ఇంట్రెస్ట్ ఉందనుకుని బెంగాలీ అమ్మాయిలు కొంతమంది ఆడతారు. వాళ్లతో చేరవచ్చని చెప్పాడు ఫైసల్. నేను వెంటనే నవ్వాను.

నన్ను చూసి రెయిన్, రెయిన్‌ని చూసి ఫైసల్ నవ్వారు. నిజానికి ఆ అబ్బాయి మొహం ధుమధుమలాడకుండా చూడ్డం ఇదే మొదటిసారి. ముగ్గురం కలిసి తిరిగివెళ్ళేప్పుడు ఎప్పటినుండో స్నేహితులంలాగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళాం.

ఆ తరవాత ప్రతిరోజూ ముగ్గురం కలిసే భోంచేసేవాళ్ళం. కాస్త స్నేహం పెరిగాక మొదటిరోజు నేను, రెయిన్ తిట్టుకున్న మాటలు వినిపించాయా అని అడిగాము. వినిపించాయి అన్నట్టుగా తలూపాడు. ఇద్దరం సారీ చెప్పాము. వాళ్ళ దేశంలో ఇదంతా చెల్లదని, అంత మోడ్రన్ కాదని, అమ్మాయిలు, అబ్బాయిలు స్నేహంగా ఉండరని చెప్పాడు. నాకు కోపం ఘోరంగా వచ్చింది.

'ఇండియా ఈజ్ ఫార్వర్డ్' అన్నాను.

'యస్' అన్నాడు.

నాకు అర్ధంకాక బేక్‌వర్డ్ అని ఎందుకన్నావు మరి అని అడిగాను. ఆశ్చర్యంగా నా మొహం ఓ నిమిషం పాటు చూసి "ఐ యాం ఫ్రమ్ బాంగ్లాదేశ్" అన్నాడు.

రెండు నిమిషాలు నిశ్శబ్దం. ఆ తరవాత నవ్వుకున్నాం. అంతవరకు అతని చేష్టలు చూసి వచ్చిన కోపమంతా వెళ్ళిపోయింది. దాంతోపాటు ఆ దేశం వారిపై, అలా వెనకబడిన దేశం నుండి వచ్చి ఇంత బాగా ఇమిడిపోయిన వారి గురించి గౌరవం కలిగింది. ఓ రోజు సాయంత్రం ఎండ తగ్గాక కేంపస్‌లో నిజమ్ వైపు వెళ్ళాను. అక్కడ చాలామంది ఒకేసారి బయటకి రావడం చూసి లోపలికి వెళ్ళాను. అక్కడ పనిచేస్తున్న ఒక తెలుగబ్బాయిని అడిగితే వాళ్ళంతా అక్కడ క్లాస్ పూర్తిచేసి వెళుతున్నారని చెప్పాడు. జిమ్ లో ఏం క్లాస్ అని అడిగితే "డాన్స్ క్లాస్" అన్నాడు.

"ఎవ్వరైనా చేరచ్చు, నిన్ననే మొదలైంది. రోజూ ఉంటుంది. అన్నీ బేసిక్సే. ఎప్పుడు కుదిరితే అప్పుడు రావచ్చు కాని రోజూ వస్తే నయం. మెషిన్ పై వర్కౌట్ చేసే బదులు ఇలా ఎక్సర్సైజ్ చెయ్యడానికి కూడా వస్తారు చాలామంది" చెప్పాడు.

మర్నాడు రెయిన్‌ని రమ్మని ఇద్దరం చూడ్డానికి వెళ్ళాము. అందరి ముందు డాన్స్ చెయ్యడం సిగ్గు కనుక బయట నిలబడే చూసాము. లోపల కొంతమంది షూస్ వేసుకుంటే మరి కొంతమంది ఉత్త కాళ్ళతో ఉన్నారు. మా ఇద్దరిని గమనించి డాన్స్ మాస్టర్ లోపలికి రమ్మన్నారు. ఒక్క క్షణం పరుగుతీద్దామనుకున్నాను. రెయిన్ ఒకడుగు ముందుకేసి నా వైపు చూసింది.

"ఐ డోంట్ డాన్స్" అన్నాను.

"ఇట్స్ ఓకే. యు కెన్ వాచ్" అన్నారు డాన్స్ మాస్టర్.

అక్కడ ఉన్నది కొంతమందే అయినా ఎంతో భయంగా అనిపించింది. రెయిన్ లోపలికి వెళ్ళి ఓ మూల నిలబడింది. నేను కూడా తన వెనక్కి వెళ్ళి నిలబడ్డాను. ఆయన క్లాస్‌ని మొదలు పెట్టారు. సినిమాల్లోలా క్లిష్టమైన క్లాస్ కాదు. చాలా సులభంగానే ఉంది. కుడి కాలు కుడివైపు, ఆ తరవాత ఎడం కాలు కుడివైపుకి ఓ అడుగు. ఆ తరవాత తిరిగి మధ్యకి రావడం. అది సులభంగా ఉందని రెయిన్ కూడా పాలుపంచుకుంది. కొంతమంది భలే విచిత్రంగా రోబాట్‌లాగా చేస్తే, మరికొందరు మార్చ్‌ఫాస్ట్‌లాగా చేసారు. అది చూసి కాస్త నవ్వొచ్చింది. మాస్టర్‌గారు నన్ను చేరమని చేత్తో సైగ చేసారు. సరే అని షూస్ విప్పి నేలకి దండం పెట్టాను.

"ఆర్ యు ఓకే?" అడిగారు మాస్టర్.

తలూపాను .అంతా నన్ను చూడసాగారు.

"డిడ్ యు ఫైండ్ వాట్ యు డ్రాప్డ్?" పక్కతను అడిగాడు.

తల అడ్డంగా ఊపి "ఐ యాం ఓకే" అన్నాను.

రెయిన్ వచ్చి ఏం జరిగింది అని అడిగింది. ఏం జరగలేదు. డాన్స్ చేసినప్పుడు భూదేవిని కావాలని తొక్కుతాం కాబట్టి మా సాంప్రదాయం ప్రకారం ముందుగా క్షమార్పణలు చెబుతాం అన్నాను. అది నచ్చి కొంతమంది కూడా చేసారు.

ఆ తరవాత మొహమాటంగా గుంపులో గోవిందంలా వెనకాల నిలబడి డాన్స్ చేసాను. నేను అనుకున్నంత ఇబ్బందిగా అనిపించలేదు. చాలామంది విచిత్రంగా చెయ్యడంతో భయం కూడా పోయింది. నెక్స్ట్ స్టెప్‌కి చుట్టూ తిరగాలి. ఆ చుట్టూ తిరగడంలో రోబాట్‌ని, మిలటరీ ఆఫీసర్‌ని చూసి నేను నవ్వు ఆపుకోలేకపోయాను. నన్ను చూసి మరి కొందరు నవ్వారు. అలా ఆ క్లాస్ అంతా సరదాగా గడిచిపోయింది.

అందరూ వెళ్ళిపోతుండగా మాస్టర్‌గారు నన్ను ఆపి ఎలా అనిపించింది అని అడిగారు. 'బావుంది' అని చెప్పాను. ఇండియన్స్ చాలామందిని నాక్లాస్‌లో చూసాను కానీ ఎవరూ అలా దండం పెట్టలేదని చెప్పారు. అది నాకు చిన్నప్పటినుండి అలవాటు కాబట్టి చేసానని చెప్పాను. ఆ తరవాత మనకున్న రకరకాల డాన్సుల గురించి, ఆ డాన్సులకి వేసుకునే ట్రెడిషనల్ బట్టలగురించి మాట్లాడుతూ నేను కొన్ని గూగుల్ ఫోటోలు చూపించాను. కుదిరితే తను గ్రాడ్యుయేట్ అయ్యాక ఇండియన్ డాన్సుల్లో ఒడిస్సీ లేదా కూచిపూడి నేర్చుకోవాలనుకుంటున్నారని చెప్పడంతో అతను కూడా స్టూడెంటా అని ఆశ్చర్యపోయి అడిగాను.

తనది డాన్స్ మేజరని, ఇప్పుడు మాస్టర్స్ పూర్తవుతుందని చెప్పాడు. సమ్మర్‌లో పార్ట్ టైమ్ గా ఇలా డాన్స్ నేర్పుతున్నాడని, ఎక్కువ మంది చేరితే యూనివర్సిటీ అతనికి జీతం ఇస్తుందని, లేకపోతే క్లాసు ఆపేస్తారని చెప్పడంతో నేను, రెయిన్ ఎన్రోల్ అయ్యాము. ఇది ట్రాన్స్‌క్రిప్ట్‌లో వస్తుందా అని అడిగినందుకు అతను పెద్దగా నవ్వి, 'నాకు ఎగ్జామ్స్ ఇష్టం ఉండవు. అందుకని గ్రేడ్ లేదు' అన్నాడు.

నేను రెయిన్ క్లాస్ పూర్తి చేసుకుని తిరిగి లాబ్ వైపుగా నడిచాము. దారిలో నాకు తెలిసిన కొందరు కనబడ్డారు. వాళ్ళు కొన్ని రోజులు రోడ్ ట్రిప్‌కి వెళ్ళి తిరిగి వచ్చారట. వాళ్ళకి మా డాన్స్ క్లాస్ సంగతి చెప్పి రేపటి నుండి చేరమన్నాము. మొహమాటానికి చేరతామన్నారని అర్ధమయింది. నేను అన్నయ్య దగ్గరకి వెళ్ళాననుకున్నారట. సమ్మర్లో రిసర్చ్ పనిచేస్తున్నా అంటే ఎందుకు సమ్మర్‌లో చెయ్యడం అని అడగడం నాకు కాస్త కోపాన్ని, కాస్త ఆశ్చర్యాన్ని కలిగించింది. ఫ్రైడేనాడు వాళ్ళు ఈగిల్ క్రీక్ పార్క్‌కి వెళుతున్నారని, అక్కడ జిప్‌లైన్ చేసి, హైక్ చేసి వస్తామని చెప్పి, నన్ను కూడా రమ్మన్నారు. మాట వరసకి కూడా రెయిన్‌ని పిలవకపోవడంతో నాకు కోపం వచ్చి కుదరదన్నాను. తిరిగి వెళుతుండగా, "ఇట్ సౌండ్స్ ఫన్. యు షుడ్ గో" అంది రెయిన్

నిజంగా పిలవలేదని, కనిపించినందుకు రమ్మన్నారని చెప్పాను. అలా మాట్లాడుతుండగా మనం వెళ్లచ్చుకదా అన్న ఆలోచన ఇద్దరికీ తట్టింది. కానీ మా ఇద్దరికి కారు లేదు, డ్రైవింగ్ రాదు. దాంతో మర్నాడు ఫైసల్‌ని అడుగుదామని నిశ్చయించుకుని ఇంటికి వెళ్ళిపోయాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story